www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 26 డిసెంబర్ 2024

5

డిసి చైర్మన్ గోపాలస్వామికి అభినందన

ప్రజాశక్తి - అలమూరు

మండల డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డిసి) చైర్మన్ మెర్ల గోపాలస్వామిని మండలంలోని చొప్పెల్లలో టిడిపి నేతల ఆధ్వర్యంలో బుధవారం అభినందించి, ఘనంగా సన్మానించారు. ముందుగా వారంతా కలసి మెర్లకు సాలువ కప్పి, బొకే అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వానపల్లి సత్యనారాయణ(సత్తిపండు), ఎంపిపి మాజీ ఉపాధ్యక్షుడు జొంపోలు వెంకట్రావు, టిడిపి నేతలు సఖమల్ల రాముడు, ఆకుల రెడ్డియ్య, తదితరులు పాల్గొన్నారు.

మెర్ల గోపాలస్వామిని సన్మానిస్తున్న టిడిపి నేతలు

నిబంధనలు బేఖాతరు

- ఇంటర్మీడియట్ విద్యార్థులే లక్ష్యం
- నీట్, జెఇఇ మెయిన్స్ పేరుతో అడ్డగోలు దోపిడీ
- ఉదాసీనంగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కార్పొరేట్ కళాశాలలు, కోచింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలను తిలోదకాలిస్తున్నాయి. ఇంటర్మీడియెట్ విద్యార్థులే లక్ష్యంగా అడ్డగోలు దోపిడీకి తెరలేపుతున్నాయి. తల్లిదండ్రులను మభ్యపెట్టి ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ వసూలు చేస్తున్నాయి. 'నీట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షల కోసం ఏటా రూ.100 కోట్ల వ్యాపారం జరుగుతోంది. అధిక శాతం కేంద్రాలకు ఎటువంటి అనుమతులూ లేవని తెలుస్తోంది. నీట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ప్రైవేట్ కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ అనుమతులు లేకుండానే శిక్షణ సంస్థలను పెట్టి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల్లో దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనధికార కోచింగ్ సెంటర్లను కట్టడి చేయడంలో అధికారులు వెనకబడుతున్నారు. నగరంలోనే ఏటా పది వేల మందికి పైగా వివిధ కేంద్రాల్లో శిక్షణ తీసుకుంటున్నారని సమాచారం. ఒక్కో విద్యార్థి రూ.2 లక్షల చొప్పున ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం రూ.100 కోట్ల వ్యాపారం నడుస్తున్నట్లు తెలుస్తోంది.

ఒక్కో విద్యార్థి ఫీజు రూ.2 లక్షలకు పైనే..

నీట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షల కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలు ఏడాదికి ఒక్కో విద్యార్థి వద్ద రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. ఆ సెంటర్లలో నిష్ణాతులైన బోధనా సిబ్బందిని నియమించడం లేదు. పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారిని అధ్యాపకులుగా నియమించి బోధన మమ అనిపిస్తున్నారు. అత్యధిక ర్యాంకులకు కేరాఫ్ తమ సంస్థనే అని కొన్ని కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రచారం చేస్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ర్యాంకుల మాట అటుంచి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో కూడా ఉత్తీర్ణులుకాని విద్యార్థులు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అనధికారికంగా కొనసాగే కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. కొన్ని వసతి గృహాల్లో సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయి. ఇరుకైన అద్దె భవనాల్లో వసతి గృహాలు కొనసాగుతున్నాయి. వెలుతురు, గాలి లేని గదుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను ఉంచుతున్నారు. విద్యార్థులు స్నానం చేయాలన్నా, టాయిలెట్‌కు వెళ్లాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

అధికారుల చర్యలేవీ..?

నీట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు నగరంలో భవనాలు అద్దెకు తీసుకుని ఆకర్షణీయమైన కటౌట్స్‌తోపాటు, కరపత్రాలు, పోస్టర్లతోపాటు ప్రసార మాధ్యమాల ద్వారా నీట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షల్లో అత్యధిక ర్యాంకులు సాధించినట్లు ప్రచారం చేసుకుంటున్నాయి. కొన్ని గుర్తింపు లేని వివిధ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలతో ఒప్పందం చేసుకుని కోచింగ్ ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటివి జిల్లా కేంద్రాల్లో పదుల సంఖ్యలో ఉన్నాయి. నిబంధనలు విస్మరిస్తున్నా ఇలాంటి కోచింగ్ సెంటరల్లో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు ఎక్కడా లేవు.

రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణ పనులను సంక్రాంతిలోగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బి అధికారులకు కార్మిక శాఖ మంత్రి సుభాష్ సూచించారు. రోడ్ల నిర్మాణ పురోగతిపై ఆయన అధికారులతో బుధవారం సమీక్షించారు. సిఎం ఆదేశాల మేరకు శిథిలావస్థలో ఉన్న రోడ్లతో పాటు, కొత్త రోడ్ల నిర్మాణం వచ్చే సంక్రాంతి నాటికి పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే పురోగతిలో ఉన్న రోడ్లు, నూతన ప్రతిపాదనలు వెరసి రూ.కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ఆర్అండ్‌బి పరిధిలో రూ.7.86 కోట్లతో 87 కిలోమీటర్ల మేర 23 పనులు జరుగుతున్నాయని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. ఇవి కాకుండా రూ.3.5 కోట్లతో తిప్పరాజుపాలెం నుంచి కాజులూరు రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అదే విధంగా కాజులూరు మండలంలో 27 పనులకు సం బంధించి 9 పనులు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.30.5 కోట్లతో 35.95 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు ప్రతి పాదనలు పంపామని నిధులు మంజూర య్యేలా చర్యలు చేపట్టాలని మంత్రి సుభాష్ ను కోరారు . పల్లె పండుగ కార్యక్రమంలో రూ. 3.34 కోట్లతో 5.92 కిలోమీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణానికి, 0.53 కిలోమీటర్ల మేర డ్రయిన్ల నిర్మాణం కోసం పనులు చేపట్టామని, వీటిలో 9 పనులు పూర్తయినట్లు వివరించారు. రామచంద్రపురంలో రూ.3.9 కోట్లతో 7.6 కిలోమీటర్ల పనులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. కె.గంగవరం మండలంలో రూ.1.17 కోట్లతో 24 పనులు 2.69 కిలోమీటర్ల మేర జరుగుతున్నాయని వివరించారు. వీటితో పాటు రామచంద్రపురం, కె.గంగవరం మండలంలో రూ.7.2కోట్లతో 67 పను లకు ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలోనే పను లన్నీ పూర్తవుతాయని వివరించారు. పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డి ప్యూటీ ఇఇ సత్యశ్రీనివాస్, డిప్యూటీ ఇఇ ఎస్ఎస్ బాబు, డిఇఇ సూర్యనారాయణ, జెఇలు భవాని శంకర్, వెంకటేశ్వరరావు, కామేశ్వరరావు, జెఇలు ప్రసన్న, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

జెఇఇ, నీట్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మోడరన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం జెఇఇ, నీట్ పరీక్షలపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఏర్పాటుచేసిన సమావేశంలో మోడరన్ అధినేత లయన్ జివి.రావు మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా జెఇఇ, నీట్ షెడ్యూల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీ పరీక్షల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నామని వివరించారు. ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్ మాట్లాడుతూ హైదరాబాద్ కు చెందిన ఐ -ఐకాన్ అకాడమీ సౌజన్యంతో పటిష్టమైన ప్రణాళికతో జెఇఇ, నీట్ కోర్సులు బోధన జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ వరకు చదివి, మోడరన్‌లో జూనియర్ కాలేజీలో జెఇఇ ప్రోగ్రామ్ విద్యార్థినిగా అత్యుత్తమ ర్యాంక్ సాధించి, అనంతరం ప్రతిష్టాత్మక నాగపూర్ ఎన్ఐటిలో బి.టెక్ పూర్తిచేసి, ప్రస్తుతం ఢిల్లీలో సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న ఎన్.నితిషా కార్యక్రమంలో పాల్గొని పేరెంట్స్ ను ఉద్దేశించి మాట్లాడారు. మోడరన్ జూనియర్ కాలేజ్ నందు అత్యుత్తమశిక్షణ ప్రణాళిక బద్ధంగా ఇవ్వటం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థులకు మోడరన్ విద్యాసంస్థలు పూర్తిగా సపోర్ట్ చేస్తుండటం హర్షణీ యమన్నారు. వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, కాంపిటేటివ్ సెల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లయన్ జివి.రావు

ఎల్ఐసి ఏజెంట్ల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

లైఫ్ ఇన్స్యూరెన్స్ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సర్వసభ్య సమావేశం అమలాపురం యూనియన్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్ర రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం డివిజన్ (ఎఒఐ) యూనియన్ అధ్యక్షుడు వై.విశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎల్ఐసి ఎఒ ఐ స్థాపించినప్పటి నుండి ఇప్పటివరకు 58 ముఖ్య డిమాండ్లను సాధించిందని గుర్తు చేశారు. మరో ముఖ్య అతిథి డివిజన్ సెక్రటరీ వి.నాగిరెడ్డి మాట్లాడుతూ 11 ఫిబ్రవరి 2025న ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాకు అమలాపురం నుండి అధిక సంఖ్యలో ఏజెంట్స్ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యవర్గం అంతా ఢిల్లీలోని ధర్నాకు వెళ్లాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే కంపెనీలో వచ్చిన మార్పుల గురించి కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ గుమ్మలూరి వినాయకరావు, ట్రెజరర్ దొమ్మేటి శివ స్వామి, ఉపాధ్యక్షులు శీలం లంకేశ్వరుడు, కోరుమిల్లి మధు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అయినవిల్లి నాగేంద్ర కుమార్, జాయింట్ సెక్రటరీ మేడిశెట్టి నాగభూషణం, ఇసి మెంబర్స్ లక్కింశెట్టి వరలక్ష్మి, యడ్ల ఆదినారాయణ, కొప్పుల సంతోష్, అధికారపు బాబ్జి, యనమదల శ్రీనివాసరావు, గుమ్మల్ల గణేష్, కాండ్రేగుల నరసింహ శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - అమలాపురం

ఇటీవల కృష్ణాజిల్లా కష్ణలంకలో జరిగిన ఎపి రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 పవర్ లిఫ్టింగ్ పోటీలో అమలాపురం హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ లో శిక్షణ పొందుతున్న ఇందుపల్లి హై స్కూల్ విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. బి.సింధు, జితేంద్ర దొర, వి.సోమశేఖర్, కె.నాని పతకాలు సాధించి రాష్ట్రస్థాయి టీం ఛాంపియన్షిప్ విన్నర్‌ను కైవసం చేసుకున్నారు. టీం కోచ్ గా ఎం.వీరేంద్ర, మేనేజర్‌గా పిఇటి బి.బుజ్జి వ్యవహరించారు. విజేతలందరినీ బుధవారం హెల్త్ అండ్ ఫిట్నస్ జిమ్ లో కళాశాల పీడీ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ట్రెజరర్ దొమ్మేటి వెంకటరమణ అధ్యక్షతన సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎంవి.సముద్రం, ఆకుల శివ, చీకట్ల సత్యనారాయణ మూర్తి, వాకపల్లి దొరబాబు, వెంకట్, చందు, జయప్రకాష్, బాబి జిమ్ మెంబర్స్ పాల్గొన్నారని కోచ్ వెంకటేశ్వరరావు తెలిపారు.

పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందన

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

ఎన్.కొత్తపల్లిలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మాలమహానాడు నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

ఉప్పలగుప్తం: రాజ్యసభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు మాల మహానాడు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఎన్.కొత్తపల్లిలో మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్ షా వ్యాఖ్యలు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు ఘోర అవమానం అని బిజెపి ఎప్పుడూ రాజ్యాంగానికి, అంబేద్కర్‌కు ఆయన సిద్ధాంతాలకు వ్యతిరేకమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ చరిత్రను, రాజ్యాంగ రచనలో అంబేద్కర్ చేసిన కృషిని తెరమరుగు చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అంబేద్కర్ ను అవ మానిస్తే సహించబోమని అమిత్ షా తక్షణం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నేరేడుమిల్లి రాజు, కొల్లి నరేంద్ర, పొలమూరి నాగేశ్వరరావు, భీమవరపు విజయ్ కుమార్, గోసంగి సన్ని, నేరేడుమిల్లి రాజేశ్వరరావు, చింతా సత్యనారాయణ, గోసంగి రాంపండు, భీమవరపు ఏసు, నేరేడుమిల్లి పల్లం రాజు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** అమిత్ షా ను కేంద్ర మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలంటూ బుధవారం అమలాపురం మండలం వన్నె చింతలపూడి గ్రామంలో అంబేద్కర్ ఆదర్శ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ నినాదాలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వన్నె చింతలపూడి నుంచి సమనస సెంటర్ వరకు ర్యాలీగా చేరుకుని అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు.అమిత్ షా పై దేశ ద్రోహం కేసు నమోదు చేసి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరమట మోహన కుమార్, నక్కా కృష్ణ, పరమట వెంకటేశ్వర రావు, కందేరి వెంకట రమణ, పరమట సురేష్, కుంచే వెంకటేష్, పరమట భీమా మహేష్, కందేరి సంజీవయ్య, కందేరి చిన సత్యనారాయణ, మోర్త రంగారావు, నక్కా రాజా బాబు, కందేరి చిట్టి బాబు, దళిత నాయకులు పాల్గొన్నారు.

వన్నెచింతలపూడిలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సంఘం నాయకులు

కె.పెదపూడిలో నూరు శాతం టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - అంబాజీపేట

కె.పెదపూడి బూత్ నంబర్ 140 కన్వీనర్, రాష్ట్ర టిడిపి ఎస్‌సి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ నూరు శాతం సభ్యత్వ నమోదు పూర్తి చేశామని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, చిక్కం పల్లంరాజు, మందా రాజేష్, మోకా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వం నమోదులో కో కన్వీనర్, పెదపూడి టిడిపి నాయకులు

పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు

మందపల్లిలో రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలోని మందపల్లిలో రోడ్డు నిర్మాణ పనులను కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు బుధవారం పరిశీలించారు. నిర్మాణం విషయంలో రాజీ లేకుండా న్యాణ్యతగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ధరణాల రామకృష్ణ, సిద్ధంశెట్టి సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - అమలాపురం

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, పరిశోధనాశక్తిని వెలికితీయాలనే లక్ష్యంతో విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను భావి శాస్త్ర వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసింద న్నారు. సమాజంలో వచ్చే మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచన లకు పదును పెట్టి ఆవిష్కరణలు చేసేలా పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సహించాలని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి వచ్చిన ఉత్తమ ఆలోచనలను పరిగణనలోనికి తీసుకొని విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేయాలన్నారు. నాణ్యమైన, సమాజ హిత, వినూత్నమైన ప్రాజెక్టులను తయారు చేయాలని సూచించారు. సుస్థిరమైన భవిష్యత్తు కోసం శాస్త్ర సాంకేతికత ,ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, సమాచార రంగం, సేంద్రియ వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, నమూనాలు,వ్యర్థాలు, వనరుల నిర్వహణ వంటి ప్రాజెక్టులను తయారు చేయాలన్నారు.ప్రతి పాఠశాల నుంచి వీటిలో ఏదో ఒక ప్రాజెక్టును తయారు చేసి జిల్లా స్థాయి ప్రదర్శనలో ప్రదర్శించాలన్నారు. జిల్లా స్థాయి ప్రదర్శనలోని ఉత్తమ ప్రదర్శనలు త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుంచి ప్రదర్శిస్తారు. కోనసీమ జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ను విజయవంతంగా నిర్వహించేందుకు తగిన మార్గదర్శకాలను విడుదల చేశారు. మండల స్థాయి ప్రదర్శనకు సంబంధించి తేదీ సమయాలను 29వ తేదీకి ముందు తెలియజేయాలన్నారు మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలలు తప్పని సరిగా పాల్గొనాలన్నారు. పాల్గొనలేని పాఠశాలల వివరాలను జిల్లా సైన్స్ అధి కారికి అందజేయాలన్నారు. ప్రతి మండలానికి ఒక నోడల్ హెచ్‌ఎంను ఎంపిక చేసి, వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేయాలన్నారు.ప్రదర్శన నిర్వహణకు తగిన వేదికలను ఎంపిక చేసి, ఈ వివరాలను 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా సైన్స్ అధికారికి సమర్పించాలని ప్రదర్శనలో ప్రదర్శితమయ్యే ప్రాజెక్టులు శాస్త్రీయతను ప్రతిబింబించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి మండల విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేస్తూ అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. మండల స్థాయి ప్రదర్శన వివరాలపై పూర్తి నివేదికను గురువారం సాయంత్రం ఐదు గంటల లోపు అందజేయాలన్నారు. వివరాలకు జివిఎస్.సుబ్రహ్మణ్యం జిల్లా సైన్స్ అధికారిని సెల్ నెంబర్ 9640188525 లో సంప్రదించాలన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వానపల్లిపాలెంలో మహిళలకు చీరలు అందజేస్తున్న చిన్నవరాజు, దైవదాసు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. క్రిస్మస్ సందర్భంగా కేక్‌లు కట్ చేశారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు చోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు క్రిస్మస్ వేడుకల్లో పాలొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని ఆయా గ్రామాలలోని క్రైస్తవ ప్రార్థన మందిరాలలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలను కార్యక్రమాలను నిర్వహించారు. వానపల్లిపాలెం సియోను ప్రార్థన మందిరంలో పాస్టర్ ఎం.దైవదాసు అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ వేడుకల్లో సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు పాస్టర్ దైవదాసులు సమకూర్చిన చీరలను పేద మహిళలకు అందజేశారు.

కపిలేశ్వరపురం: నల్లూరు, వెదురుమూడి, కాలేరు, కపిలేశ్వరపురం, అంగర , పడమర ఖండ్రిక, మాచర, టేకి, కోరిమిల్లి, తాతపూడి తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. ఇళ్ల వద్ద క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేశారు. **అంబాజీపేట:** క్రీస్తు త్యాగాలను స్మరించుకుంటూ శాంతి మార్గాన్ని అనుసరించాలని పిగన్నవరం సిఐ ఆర్.భీమరాజు పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. **ముమ్మిడివరం:** క్రీస్తు చూపిన శాంతి మార్గాన్ని అనుచరించి ఆనందదాయక జీవన విధానాన్ని పెంపొందించుకోవాలని ముమ్మి డివరం ఎంఎల్ఎ, శాసనసభ విప్ సభ్యులు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు కాశి లాజర్ ఆధ్వర్యం లో బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్బరాజు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణ కుమార్, పిల్లి నాగరాజు, అర్ధాని శ్రీనివాసరావు, దాట్ల బాబు తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** : నగరంలో బెతేస్త ప్రేయర్ ఫెలోషిప్ నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పాల్గొన్నారు. క్రిస్మస్ విశిష్టతను తెలియజేస్తూ క్రీస్తు బోధనలు లోకానికి ఆదర్శనీయమన్నారు. పాస్టర్ జొన్నలగడ్డ బాబురావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేకును చిట్టిబాబు కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థిని, విద్యార్థులు జీసస్, శాంటాక్లాస్, మేరీమాత వేషధారణలతో జీసస్ జననానికి సంబంధించిన అంశాలతో కూడిన నాటికలను ప్రదర్శించారు. క్రైస్తవ గీతాలు ఆలపించారు. క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ క్రిబ్ అందర్నీ అలరించాయి.



నల్లూరులో విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చి

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

నగరంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో మండలంలోని చెందుర్తి గ్రామ శివారు పుష్కర కాలువ గట్టు సమీపంలో నిర్వహించిన కోడి పందాలపై దాడి చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో ముగ్గురుని అదుపులోకి తీసుకుని, 2 కోడిపుంజులు, రూ.2 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని కాకినాడ రూరల్, గండేపల్లి, గొల్లప్రోలు కేంద్రాల్లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వాజ్‌పేయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వెంకన్న దొర కుటుంబానికి పర్వత పరామర్శ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం మాజీ సర్పంచ్ సోమరోతు భాస్కరవెంకన్నదొర ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ప్రత్తిపాడు మాజీ ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్ బుధవారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రాక్ సిరామిక్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న కల్లోల్ ఘోష్

పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - పెద్దాపురం పరిధిలోని పారిశ్రామిక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాక్ సిరామిక్స్ పరిశ్రమ ఉపాధ్యక్షుడు కల్లోల్ కుమార్‌ఘోష్ తెలిపారు. బుధవారం రాక్ పరిశ్రమ వద్ద ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఎస్ఎస్ డీలర్ షో రూమ్ ప్రత్యేక సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రాజేంద్ర సింగ్మాన్, హరీష్ కామత్, నరేశ్ రెడ్డి చంద్రశేఖర్, అభిరామ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బిజెపిలోకి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం తంటికొండ రోడ్ సిఎండి లేఔట్‌లో వ్యాపారవేత్త కంబాల శ్రీనివాసరావు బుధవారం బిజెపిలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి పాల్గొని పార్టీ కండువా కప్పి శ్రీనివాసరావును పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని సూచించారు

ప్రపంచ దేశాల జాతీయ పతాకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె ప్రాంగణంలో బుధవారం పూర్వ విద్యార్థి సుందర్ అసోసియేట్స్ ఛైర్మన్ డాక్టర్ బాదం సుందరరావు సహకారంతో ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను ఇన్‌ఛార్జ్ ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి.మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రధాన కేంద్రమైన స్విట్జర్లాండ్ దేశంలోని జెనీవాలో ఉన్న 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను ఆదర్శంగా తీసుకుని భారతదేశంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో తొలుతగా జెఎన్‌టియుకెలో ప్రపంచ దేశాల జాతీయ జెండాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జెనీవా, అమెరికాలోని న్యూయార్క్, దక్షిణ కొరియాలోని సియోల్, చైనాలోని షాంఘై, డొమినికన్ రిపబ్లిక్‌లోని శాంటో డొమింగోలో ప్రపంచ దేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆరవది జెఎన్‌టియుకెలో ఏర్పాటు చేశామన్నారు. అన్ని దేశాల జెండాలు ఒకే చోట ఉండడం ద్వారా కలిగే అనుభూతి చెప్పలేనిదన్నారు. ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన 194 దేశాల జాతీయ జెండాలు అక్షర క్రమంలో ఉంటాయని, ప్రతీ జెండా స్తంభానికి క్యూఆర్ కోడ్తో కూడిన డిస్ ప్లేను ఉంచడం జరిగిందన్నారు. దీని ద్వారా ఆ దేశ జనాభా, రాజధాని, కరెన్సీ తదితర పూర్తి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. జిల్లాలోని ప్రతీ స్కూల్, ప్రతీ సంస్థ జెఎన్‌టియుకెను సందర్శించి ఫోటోలు తీసుకోవడాన్ని గర్వంగా భావించడంతో పాటు విజ్ఞాన, పర్యాటక ప్రదేశంగా మారబోతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యేందుకు సహకరించిన యూనివర్సిటీ అధికారులకు, సుందర్ అసోసియేట్స్ ఛైర్మన్ డాక్టర్ బాదం సుందరరావు, సుధారాణి దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సుందర్ అసోసియేట్స్ ఛైర్మన్ డాక్టర్ బాదం సుందరరావు మాట్లాడుతూ ఇన్‌ఛార్జ్ ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి. మురళీకృష్ణ వాక్ విత్ నేషన్స్ అనే కాన్సెప్ట్‌ను దేశంలో తొలిసారిగా ప్రపంచ దేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను తీసుకువచ్చారన్నారు. పూర్వ విద్యార్థిగా ఈ ప్రాజెక్ట్‌ను సొంత ఖర్చుతో చేపట్టాలని నిర్ణయించుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ కెవి.రమణ, ఓఎస్‌డి ప్రొ డి.కోటేశ్వరరావు, ఛీఫ్ ఇంజనీర్ ప్రొ వి.శ్రీనివాసులు, మాజీ ఉపకులపతులు ప్రొ ఎస్.శ్రీనివాసకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రిఫరీగా మురళీకుమార్

సామర్లకోట: పట్టణంలోని ఎస్‌బిఎస్ఆర్‌సి క్లబ్ చెందిన బోగిళ్ల మురళీకుమార్ అంతర్జాతీయ కబడ్డీ రిఫరీగా ఎంపికయ్యారు. ఇప్పటి వరకూ ప్రొ కబడ్డీ రిఫరీగా వరుసగా 10 సార్లు వ్యవహరిం చారు. జగ్గంపేట ప్రభుత్వ హైస్కూల్లో పిఇటిగా పని చేస్తున్న ఆయన ఈ నెల 28న ఇండియా- ఆస్ట్రేలియా మధ్య తొలిసారిగా మెల్‌బోర్న్‌లో జరిగే కబడ్డీ మ్యాచ్ రిఫరీగా వ్యవహరించనున్నారు. మురళీకుమార్‌ను జిల్లా కబడ్డీ అసోసి యేషన్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్.కిరణ్‌కుమార్, అంతర్జాతీయ కోచ్ సాయిప్రసాద్, రిటైర్డ్ పిఇటిలు టి.వైకుంఠం అభినందనలు తెలిపారు.

దిగుబడి ఘనం.. ధర హీనం

- కర్పూర అరటి ధర పతనంతో అప్పుల ఊబిలో రైతులు
- కూలి ఖర్చులు రాని వైనం
- భారీగా పడిపోయిన ధర
- గెలకు రూ. 50 కూడా రాని వైనం
- నష్టాల్లో కూరుకుపోతున్న కౌలు రైతులు

ముగ్గిన అరటి గెలలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆరుగాలం శ్రమించి పంటలు బాగా పండి దిగుబడి బాగా వచ్చి మంచి ధర పలికితే అంతకంటే రైతుకు ఆనందం ఉండదు. కాని వ్యాపారుల మాయాజాలంతో మంచి ధర పలికితే దిగుబడి ఉండదు, దిగుబడి ఉంటే ధర లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చేసేదేమీ లేక అయినకాడికి అమ్ముకుని నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. అన్నదాత కౌలు రైతుల పరిస్థితి అయితే మరి దయనీయంగా మారుతోంది. మళ్లీ పెట్టుబడి పెట్టాలంటే అప్పు దొరక్క నానా అవస్థలు పడి చివరకు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం అరటి రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు, కొత్తపేట మండలాలలో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల అరటి పంటలను సాగుచేస్తున్నారు ఇటీవల కాలంలో వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడి వచ్చింది. మంచి రేటు వస్తుందని ఆశించిన రైతులకు చివరికి కన్నీళ్లే మిగిలాయి. ఎకరాకు రూ. 1.50 వేల వరకూ ఇప్పటికే రైతులు పెట్టుబడి పెట్టారు. కౌలురైతులు రూ.60 వేల వరకూ శిస్తు కట్టారు. పంట బాగా పండడంతో గెలలను కోసి రావులపాలెం అరటి మార్కెట్ కు తరలిస్తే గెల ఒక్కింటికి రూ.50 కూడా రాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. గెలలను కోసి రావులపాలెం మార్కెట్‌కు తీసుకురావడానికి కూలి రూ.300 అవుతోంది. దీంతో అమ్మిన ఆరు గెలలు రూ.300 రాగా అవి కూలి ఖర్చు సరిపోతున్నాయి. అరటి గెలలను అమ్ముకునేందుకు పొలాల నుంచి రావులపాలెం మార్కెట్టుకు తీసుకొచ్చిన రైతులు రూ.300 ఖర్చు అవుతోంది. కనీసం కూలి రేటు కూడా రాకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికే పక్వానికి వచ్చిన అరటి గెలలు తోటల్లో ముగ్గిపోతున్నాయి. కర్పూరానికి అరటికి ఒడిశాలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది. తూర్పుగోదావరి జిల్లాల్లో నుంచే ఎక్కువగా అక్కడికి కర్పూరరకం అరటి గెలలు ఎగుమతి అయ్యేది. అయితే ప్రస్తుతం అక్కడ కూడా కర్పూరం సాగు విస్తారంగా చేపట్టారు. కార్తీక మాసం నెల రోజులు కర్పూర రకం ఆశాజనకంగా ఉన్న ఇప్పుడు ధర పతనం అవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అలాగే రావులపాలెం మార్కెట్ నుంచి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాలకు అరటి ఎగుమతులు చేస్తూ ఉంటారు. ఆ రాష్ట్రాల్లోనూ అరటి సాగును చేపట్టలతో ఎగుమతులు తగ్గాయి. అరటిని కొనుగోలు చేసే నాధుడే లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్లెదుటే పంట ముగ్గ పోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

గతేడాది కార్తిక మాసంలో తొమ్మిది కర్పూర గెలలకు రూ.2,500 నుంచి రూ.3వేల వరకూ ధర పలికింది. ప్రస్తుతం తొమ్మిది గెలలు సైకిల్ కట్టి పంపిస్తే రూ.3 వందల వస్తోంది. కూలీ కూ.300 చెల్లించాల్సి వస్తుందని, తమకు రూపాయి కూడా మిగలకపోగా అప్పుల ఊబిలో కూరుకుపోయామంటూ రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో రావులపాలెం, అంబాజీపేట, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో అరటి మార్కెట్ యార్డులు ఏర్పాటు చేశారు. ఇక్కడ దళారీ వ్యవస్థ పెరిగిపోవడంతో గిట్టు బాటు ధర లభించట్లేదని రైతులు చెబుతున్నారు. కూలి ఖర్చులు కూడా రాకపోవడంతో మార్కెట్టుకు తరలించే పరిస్థితి కానరాకపోవడంతో పొలాల్లోనే గెలలను వదిలేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని అరటి రైతులు కోరుతున్నారు. లేకుంటే అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు.

కాగితాలకే పరిమితం కాని శీతల గిడ్డంగులు

రైతులు పండించిన పంట గిట్టుబాటు ధర లేకపోతే వాటిని కోల్డ్ స్టోరేజుల్లో దాచుకుని మంచి ధర పలికినప్పుడు అమ్ముకునేందుకు మండలానికి ఒక కోల్డ్ స్టోరేజ్‌ని నిర్మిస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటనలు చేయగానే రైతులు హర్షం వ్యక్తం చేశారు. కానీ ఈ ప్రకటనలు కాగితాలకి పరిమితం అవడంతో రైతులు నిరాశకు గురయ్యారు.

రావులపాలెం మార్కెట్ యార్డులో అరటి గెలలు

రూ.8 లక్షలు పెట్టుబడి పెట్టాను

ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని కర్పూర రకం అరటి వేశాను. పంట మంచి దిగు బడి వచ్చింది. చేసిన అప్పు తీరిపోయి పెట్టు బడికి డబ్బులు మిగులుతాయి అనుకున్నాం. కానీ ధర పతనం అవడంతోమార్కెట్టుకు తరలి ంచిన ఆరు గెలలకు రూ.300 వస్తున్నాయి దీం తో అరటి గెలలు తీసుకెళ్లడానికి సరిపోతున్నాయి. చేతికి చిల్లి గవ్వ కూడా రావడం లేదు. రూ.8 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. అప్పులు తీరే దారే కనపడటం లేదు. ఆత్మహత్యే శరణ్యం

-ముదునూరి నాగరాజు, కౌలు రైతు, ఆత్రేయపురం

పలు చోట్ల మనుస్మృతి ప్రతుల దహనం

ముమ్మిడివరంలో మనుస్మృతి ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల మాల మహానాడు నాయకులు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, అంబేద్కర్ సంఘాలు, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో బుధవారం మనుస్మతి దహన దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మనుస్మతి ప్రతులను దహనం చేశారు.

ముమ్మిడివరం: దేశంలో కుల వ్యవస్థకు కారణమైన మనుస్మృతిని దహనం చేసి, మానవ హక్కులను పరిరక్షించుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సీనియర్ నాయకుడు, అడ్వకేట్ దొనిపాటి అంజనేయులు పిలుపునిచ్చారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణ లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, అంబేద్కర్ సంఘాలు, ప్రజాసంఘాలు సంయుక్తంగా చికురుమిల్లి శ్రీనివాస్ అధ్వ ర్యంలో బుధవారం మనుస్మృతి దహన దినాన్ని మానవ హక్కుల దినంగా నిర్వహించారు. తొలుత బుద్ధ పార్కు అవరణ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులరాయించారు. అనంతరం ర్యాలీగా వచ్చి జాతీయ రహదారి 216 పై మనువు దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా కుల, వర్ణ వ్యవస్థను పెంచి పోషించే మనుస్మృతిని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 1927 డిసెంబర్ 25 న దహనం చేసి మానవ హక్కుల పరిరక్షకునిగా నిలిచారన్నారు. నాటి స్ఫూర్తితో మానవ మనుగడకు అడ్డుగా నిలిచిన మనుస్మృతిని దహనం చేద్దాం...మానవ హక్కులను కాపాడుద్దాం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ఏడుకొండలు, బుడితి శ్రీనివాస్, అయినవిల్లి వలియా బాబా, రేవు త్రిమూర్తులు, యడ్ల చిట్టిబాబు, యలమంచిలి బాలరాజు, నక్కా సూర్య ప్రకాష్, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** పట్టణం లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద కుల వ్యవస్థకు కారణమైన మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మనుధర్మ శాస్త్రం దహనం చేసి 97 ఏళ్ళు అయిన సందర్భంగా అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు తదితరులు మాట్లాడుతూ దేశంలో నిచ్చెన మెట్ల కుల వ్యవస్థకు మూల కారణం మను ధర్మశాస్త్రమే అన్నారు. మనిషికి,మనిషికి మధ్య అసమానతలను సష్టించిందన్నారు. అంబేద్కర్ అప్పటికే అమల్లో ఉన్న దుర్మార్గమైన శాసనాలను రద్దు చేసి భారత రాజ్యాంగాన్ని రాశారని అన్నారు. దళితులు ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందకుండా ఉండటానికి కారణం మను ధర్మశాస్త్రం అని అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు అంబటి కృష్ణ, ఐఎఫ్టియు నాయకులు చింత రాజారెడ్డి , వీర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి:** అసమానతలను ప్రతిపాదించి స్థిరీకరించిన మనుధర్మ ఆచరణను నిర్మూలించినప్పుడే దేశ సమైక్యత సాధ్యపడుతుందని మండల మాలమహానాడు అధ్యక్షుడు గిడ్ల వెంకటేశ్వర రావు అన్నారు. మనుస్మృతి దహన దివస్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ముక్తేశ్వరం సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో న్యాయవాది బడుగు భాస్కర్ జోగేష్ మాట్లాడుతూ. మనుధర్మం ప్రతీ వ్యక్తికీ ఒకే విలువను నిరాకరించిందని తెలిపారు. మనిషికి స్వతంత్ర విలువ కాకుండా కులం ఆధారిత విలువను ఏర్పరిచింది అన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితాచరణలో మనువును నిరాకరించినపుడే రాజ్యాంగ విలువలను ఆచరణ సాధ్యం అవుతాయన్నారు. అనంతరం మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. మనుధర్మ శాస్త్రం పుస్తకంలోని పేజీలను చింపి దహనం చేసారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిపి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ కాకర బాబ్జి, బొక్కా రామచంద్రరావు, వరలక్ష్మి నరసింహారామ్, కుంచే చంద్రకాంతుడు, బి.వెంకటేష్, పి.నాని, గిడ్ల సురేష్, వస్కాశ్యాంసుందర్, బొంతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం:** రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉన్నదని భారత రిపబ్లికన్ పార్టీ జాతీయ కార్యదర్శి డిబి లోక్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అనేక అసమానతలకు నిచ్చెన మెట్ల కుల వ్యవస్థకు మూఢనమ్మకాలకు కారణమైన మనుధర్మ శాస్త్రాన్ని పార్లమెంటులో దహనం చేసిన రోజు పురస్కరించుకొని బుధవారం సాయంత్రం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మనుధర్మశాస్త్ర ప్రతులను దహనం చేశారు కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబురావు, మాల మహానాడు నాయకులు పెయ్యల శ్రీనివాసరావు, పిడిఎస్‌యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, ములపర్తి సత్యనారాయణ, కాశి రాంబోది, కటికదళ సత్యనారాయణ, దాసరి చిరంజీవి, కాశి వెంకట్రావు, నాగబత్తుల నరసింహామూర్తి, ముత్తబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం పట్టణంలో మనుస్మృతి ప్రతులును దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ముక్తేశ్వరంలో మనుస్మృతి ప్రతులు దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు

అమలాపురంలో మనుస్మృతి ప్రతుల దహనం చేస్తున్న నాయకులు

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలెం కు చెందిన పడాల వీర్రెడ్డి కష్ణవేణి దంపతులు వారి కుటుంబ సభ్యులు బుధవారం 1 లక్ష 116 రూపాయలు ఆలయ డిసి నల్లం చక్రధరావుకు అందజేశారు. వీరికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అలాగే ఏపీపీ ఎస్ సి మెంబర్ ఎస్ ఎస్ బాబు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అయినవిల్లిలో నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని బుధవారం గొల్లప్రోలుకు చెందిన యం.శ్రీనివాస్, పద్మావతి దంపతులు కుటుంబ సమేతంగా దర్శించికున్నారు. అనంతరం విఘ్నేశ్వర స్వామి నిత్య అన్నదాన నిధికి రూ.10,116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్ రాజు తెలిపారు వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఎజిపి ప్రసన్నకు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

ఇటీవల అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఎజిపి)గా నియమితులైన న్యాయవాది బూసి విద్యా ప్రసన్నను బుధవారం మాల మహానాడు సంఘం సెక్రటరీ దడాల చంద్రరావు, సభ్యులు తాళ్ల సుఖిరాజు, గంటా మనోహర్ దాసు మండల కేంద్రంలోని ఆమె నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ముందుగా ఆమెకు దుశ్శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా పక్షపాతిగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రతినిధిగా వారి సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉన్న బూసి విద్యా ప్రసన్న ఎజిపిగా నియమితులు కావడం అభినందనీయమన్నారు

తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని పెద్ద పళ్ళలో నూతన తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ట్యాంక్ కెపాసిటీ 60,000 లీటర్లని అన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.33 లక్షల మంజూరు కాగా ఈ తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు వారు తెలిపారు. దీంతో గ్రామానికి తాగునీటి కొరత తీరుతుందని గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యశ్రీ మెహర్ ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు ప్రమీల ప్రకాష్, కూటమి నేతలు గారపాటి త్రిమూర్తులు, సలాది నాగేశ్వరరావు, గారపాటి శ్రీనివాస్, జాస్తి భాస్కరరావు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, PITHAPURAM
E.P. No.1/2020 in O.S. No.852/2016
Between:
Yarramsetti Satya Surya Kumari ...DHr/Plaintiff
and
Patamsetti Ganga Rao & another ..JDRs/Defendants
To: JDRs:
JDR-1: Patamsetti Ganga Rao
S/o. Satti Raju, aged 48 years, Business, D.No.67-7-4/9A, Ashok Nagar, Kakinada.
JDR-2: Smt. Patamsetti Hemadevi,
W/o. Ganga Rao, D.No.67-7-4/9A, Ashok Nagar, Kakinada.
పై నెంబరు అమలు గ్రంథములో 1వ మరియు 2వ JDrs అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**21-01-2025** తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు పై శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు గ్రంథము మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
D.సుబ్రహ్మణ్యం
V.V.V.S.L.కిరణ్
M.ధనుంజయరావు
అడ్వకేట్స్, సుభద్ర ఆర్కేడ్, భానుగుడి జంక్షన్, కాకినాడ, సెల్: 9849715132
N.మనోజ్‌కుమార్
అడ్వకేటు, పిఠాపురం

మాజీ మంత్రి 'మెట్ల'కు ఘన నివాళి



అమలాపురంలో మెట్ల సత్యనారాయణరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - యంత్రాంగం

మాజీ మంత్రి మెట్ల సత్య నారాయణ రావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అమలాపురం: మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణరావు వర్ధంతి అమలాపురంలో నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి నాయకులతో కలిసి మెట్ల సత్యనారాయణ రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మెట్ల రమణబాబు, అల్లాడ స్వామి నాయుడు, చిక్కాల గణేష్, నల్లా స్వామి, ఆశెట్టి అదిబాబు, బొర్రా ఈశ్వరరావు, సత్తిబాబు రాజు, గంపల ప్రసాద్ పాల్గొన్నారు. **అయినవిల్లి:** మాజీ మంత్రి దివంగత మెట్ల సత్యనారాయణరావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు మెట్ల రమణ బాబుతో కలిసి బడుగు జోగేష్ ఘన నివాళి అర్పించారు. స్థానిక మెట్ల ఘాట్‌లో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మెట్ల రమణబాబు, బడుగు జోగేష్, ఎస్‌సి సెల్ పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మెల్లం సత్యనారాయణ, టిడిపి ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్ తదితరులు వున్నారు. **కొత్తపేట:** అమలా పురం కిమ్స్ ఆసుపత్రి వద్ద గల సత్య నారాయణరావు ఘాట్‌లో ఎంఎల్‌ఎ బండారు సత్యా నందరావు తదితరులు నివాళి అర్పించారు.

29 ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - కాకినాడ

డిసెంబర్ 29 తేదీన అన్నవరంలో జరుగుతున్న భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా మహాసభను జయప్రదం చేయాలనీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఆయన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభను అన్నవరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలో ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ళ వెంకటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను చర్చిస్తామని, జిల్లా వ్యా ప్తంగా విద్యారంగంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ దశలవారి పోరాట ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యను మొత్తం ప్రయివేటీకరణ, కాషాయికరణ చేసుందుకు కుట్రలు సాగిస్తుందన్నారు. విద్యారంగంలో కార్పొరేట్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని, 117, 77 జీవోలను రద్దు చేయాలని, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, ఈ ఏడాది నుంచే విద్యార్థులకు తల్లికి వందనం, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అ ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవ్, సహాయ కార్యదర్శి సాయిత్, సంజాయ్ పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన
దేవరపల్లి మండలం, చిన్నాయగూడెం గ్రామం తాలూకు **గద్దే దీపిక D/o వెంకటరామారావు** గారిది ఈ దిగువ చూపబడిన ఆస్థికి సంబంధించి దైస్తావేజు **నెం.1915/2008, ది.24-05-2008** నందిగూడెం గ్రామానికి చెందిన **ఆర్.యస్.నెం.10, 3 ఎకరాలు** గల డాక్యుమెంటుకు సంబంధించి యర్నగూడెం బ్యాంక్ నుండి చిన్నాయగూడెం మోటార్ సైకిల్ పై వచ్చుచుండగా దారిలో పడిపోయినది. కావున దొరికిన వారు సెల్ నెం. 9441780902 కు తెలియపర్చగలరు.
గద్దే దీపిక D/o వెంకటరామారావు
ఇంటి నెం.5-18, చిన్నాయిగూడెం, రామాలయం వీది,దేవరపల్లి మండలం,తూర్పుగోదావరి జిల్లా
సెల్ 9441780902

ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో మెడల్ సాధిస్తా

రోలర్ హాకీ కాంస్య పతక విజేత నాగ సాయి కేశవ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్రంలోని మంగళగిరిలో 2027లో నిర్వహించనున్న ఏషియన్ ఛాంపియన్‌షిప్ రోలర్ హాకీలో మెడల్ సాధించడమే తన లక్ష్యమని మునుపర్తి నాగ సాయి కేశవ్ ధీమా వ్యక్తం చేశాడు. డిసెంబర్‌లో కోయంబత్తూర్‌లో నిర్వహించిన అండర్ 14, సబ్ జూనియర్స్ విభాగంలో నేషనల్ రోలర్ స్కేటింగ్ హాకీకి జాతీయస్థాయి పోటీల్లో ఎపి టీమ్ గోల్ కీపర్‌గా కాంస్య పతకం సాధించాడు. కేశవ్ మండలంలోని గ్రామానికి చెందిన మునుపర్తి రమేష్, దేవి ఏకైక కుమారుడు. ఉద్యోగ నిమిత్తం బుట్టాయిగూడెం నుండి వచ్చి, చివటం, జగనన్న కాలనీలో రమేష్ కుటుంబం నివాసం ఉంటోంది. 12 ఏళ్ల కేశవ్ తణుకు ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో ఎఫ్‌వన్ మెరిట్ స్టూడెంట్‌గా చదువుతున్న కేశవ్ గత రెండేళ్ల నుంచి రోలర్ స్కేటింగ్ హాకీ సాధన ప్రారంభించారు. పాఠశాలలోనే కోచ్, ట్రైనర్ భార్గవ్ వద్ద శిక్షణ పొందుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. మూడు నెలల శిక్షణా కాలంలోనే తణుకు పట్టణంలో జిల్లాస్థాయి ట్రయల్స్‌లో పాల్గొని, అనంతరం జాతీయస్థాయి పోటీలలో మెడల్స్ సాధించాడు. ఈ నేపథ్యంలో 2023 స్టేట్ ఆర్ఎస్ఎఫ్ఐ రోలర్ స్కేటింగ్ హాకీలో కాంస్య పతకం సాధించాడు. అదే సంవత్సరం జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. చండీఘర్‌లో జరిగిన 61వ నేషనల్ స్కేటింగ్ చివరి దశలో పాలు పంచుకోవడం, వాతావరణం అనుకూలించకపోవడంతో ఓటమి పాలయ్యాడు. 2024 రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ హాకీలో సిల్వర్ మెడల్ సాధించాడు. నవంబర్ నెలలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ ద్వారా సిల్వర్ పతకం అందుకున్నాడు. దేశం తరపున, అంతర్జాతీయ స్థాయి పోటీలలో తన కుమారుడు పాలు పంచుకోవడానికి, తాము ఎంత కష్టమైనా భరిస్తామని కేశవ్ తల్లిదండ్రులు తెలిపారు. కేశవ్‌కు పాఠశాల యాజమాన్యం, బంధువులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

తల్లిదండ్రులతో కాంస్య పతక విజేత కేశవ్

ప్రకటన



కీ॥శే॥ కాంద్రేగుల అమ్మన్న(లేటు)
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారం గ్రామ కాపురస్తులు కాంద్రేగుల మహాలక్ష్మి w/o రామసుబ్రహ్మణ్యం (లేటు) వ్రాయించి ఇచ్చిన ప్రకటన
నా అత్తయ్య కాంద్రేగుల అమ్మన్న w/o సుబ్బన్న గున్నేపల్లి అగ్రహారం గ్రామంలో మా ఇంటి వద్ద **ది.19-02-2016** సం॥రం॥ లో మరణించారు. వీరి మరణం నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.
ఇట్లు:
కాంద్రేగుల మహాలక్ష్మి
w/o రామసుబ్రహ్మణ్యం (లేటు),
C/o కాంద్రేగుల సాయిబాబు s/o సుబ్బన్న,
గున్నేపల్లి అగ్రహారం,అమలాపురం మండలం,
సెల్:98487 37920

IN THE COURT OF THE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE :KAKINADA
O.S.NO. 395/2023
Between:
State Bank of India Retail Assets, Small & Medium Enterprises Center, Kakinada represented by its Authorized signatory, Visamsetty Rajasekhar ...**Plaintiff**
And
1. ASAD Apparels Private Limited, Rep by its Managing Director Mohammed Amirun Begum and others ...**Defendants**
To.
1. ASAD Apparels Private Limited, Kakinada Rep by its Managing Director Mohammed Amirun, W/o Mohammed Asad Ullah, aged 33 Years, D.No.17-2-60/35, Opp. AMG Road, Kakinada.
2. ASAD Apparels Private Limited, Kakinada Rep by its Director Shaik Ziauddin, S/o Shaik Mohammad, aged 27 Years, D.No.17-2-60/35, Opp. AMG Road, Kakinada
3. Mohammed Amirun Begum, W/o Mohammed Asad Ullah, aged 33 years, Business, D.No.20-11-13, Block No. G1, Ratna Towers, Masid Center, Main Road, Kakinada
4. Shaik Zlauddin, S/o Shaik Mohammad, aged 32 years, Business, D.No.17-2-60/35, Opp. AMG Road, Kakinada.
పై నెంబరు దావాలో **1 To 4** ప్రతివాద్లు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 29-01-2023** తేదికి వాయిదా వేసినారు మీరు ఆ రోజు ఉదయం **గం.10.30** ని॥లకు పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
K.V.S.V.లక్ష్మాజిరావు
అడ్వకేట్, కాకినాడ
సెల్:9866211196